# దాగని సత్యం

చాలా ఘోరం జరిగి పోయింది !

ఆ చుట్టు ప్రక్కల గ్రామాలన్నీ దద్దరిల్లిపోయాయి. తండోపతండాలుగా జనం చూడవస్తున్నారు. సినిమాహాళ్ళ దగ్గర, బస్సులలో, సంతలలో, కాఫీ హోటళ్ళలో పదిమంది జనం ఎక్కడుంటే అక్కడ ఇదే కబురు, ఇదే సంగతి.

ఒక ప్రముఖ దినపత్రిక జిల్లా ఎడిషన్‌లో ఈ వార్త ఫోటోతో సహా మొదటి పేజీలో ప్రచురించింది. ఆ మర్నాడు అన్ని తెలుగు, ఇంగ్లీషు దిన పత్రికలు - లోపలి పేజీల్లో ఆ వార్తను ప్రచురించాయి. అనేక మంది ఎం.ఎల్.ఏలు, ముగ్గురు ఎం.పీలూ, ఇద్దరు మంత్రులూ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పెద్ద పెద్ద ఆఫీసర్ల సంగతి లెక్కేలేదు. అన్నట్టు ఒక మాజీ మంత్రిగారు కూడా వచ్చారు.

అసలింతకీ ఏం జరిగిందంటే ... ఈ సంగతంతా మొదటినుంచీ చెప్పడం మంచిది.

ఆ మహానుభావుడు ఆ ప్రాంతానకి ఏ ముహూర్తానవచ్చాడో, విపరీతంగా పంటలు పండేశాయి. అంతకు ముందు మూడు సంవత్సరాలుగా వరుసగా పంటలు పోయాయి. జనం అల్లాడిపోయారు.

ప్రజ - తీర్థ ప్రజే-ఆయన దర్శనం చేసుకున్నారు. పాదపూజ చేశారు. తమకు కలిగింది సమర్పించుకున్నారు. ఏడాది తిరక్కుండా చెట్టుకింద పాకలో వుండే వారి ఆశ్రమం పక్కాబిల్డింగుగా మారిపోయింది. విశాలమైన హాలు తర్వాత స్వామివారి ధ్యానమందిరం -వేరుగా నివాస గృహం - వంటశాల - నుయ్యి- చుట్టూ తోట - తులసికోట-మండపం - ఆశ్రమం అంతా ఎలక్ట్రిసిటీ దీపాలు

ఆ ఆశ్రమం పట్టణానికి తూర్పు శివార్ల లోవుంది. ట్రంకురోడ్డును ఆనుకునేవుంది. పడమరగా వెళితే రాజమండ్రి -తూర్పుగా వెళితే విశాఖపట్నం -దగ్గరే.

మొదట ఆ ఆశ్రమం ఒక చెట్టు కింద వుండేది. ఆచెట్టు ప్రక్కనుంచి కొండ మీదికి కాలిబాటవుంది. కర్రలు కొట్టుకునే వాళ్ళు . మేకల్నీ గొర్రెల్నీ ఇతరపశువుల్నీ మేపుకునేవాళ్ళూ ఆ దోవనే వెళ్ళేవాళ్ళు. ఆశ్రమం అంటే మరేమీకాదు - నాలుగు కర్రలమీద నిలబెట్టిన చిన్న పందిరి. దాని మీద నాలుగు తాటాకులు - అంతే.

దోవనపోయేవాళ్ళందరికీ స్వామీజీ బొట్టు పెట్టుకుని వెళ్ళిన వాళ్ళ కు - వెళ్ళిన పని జయప్రదం అవుతుందనే నమ్మకం క్రమంగా జనంలో ప్రబలంగా వ్యాప్తి పొందింది.

ఆయనని అందరూ స్వాములవారనే అంటారు. వేద స్వామీజీ అంటారు. అసలు పేరెవ్వరికీ తెలీదు. ఎవరూ అడగడం కాని ఆయన చెప్పవలసిన అవసరంగాని ఎప్పడూ రాలేదు. ఆ కొండవారనే - ఆశ్రమానికి అరమైలుదూరంలో ఒకగెడ్డ వుంది. తూర్పు తెల్లవారకుండానే - చీకటితో - ఆ గెడ్డలో స్నానం చేసి వచ్చి తెల్లవారేసరికి భగవద్గీత శ్లోకాలూ, భక్తిగీతాలు, తత్వాలూ పాడుతుండేవారు.

ఆరడుగుల మనిషి. బంగారురంగు శరీరఛాయ. కమ్మెచ్చునతీసినట్టున్న సౌష్టవ మైన శరీరం - ఒత్తయిన నల్లని గడ్డం- అక్కడక్కడ ఒకటీ ఆరా వెంట్రుకలు నెరిశాయి. వయసు 40-45 మధ్య వుండొచ్చు. కాని అంతవయసున్నట్టు కనపడదు. కంఠం ఎత్తి అయన భక్తితత్వాలు పాడేడంటే ఆమడ దూరం వినిపిస్తాయి. ఓంకారం పట్టాడంటే - జనం భక్తితో ఊగి పోతారు. అంత చక్కని శ్రావ్యమైన, గంభీరమైన కంఠస్వరం.

ఆ సంవత్సరం పల్లపు భూములేమీ, మెట్టభూమిలేమి, కొండ్రలేమీ- విరగబండేశాయి. వరీ, చెఱకూ కూడా విస్తారంగా పండింది. కంది, పెసర,మిరప, వేరు శనగ - మొదలైనపంటలుకూడా మున్నెన్నడూ లేనంతబాగా పండేశాయి. ఆయన రైతులతో చెప్పారట- ఈ సంవత్సరం గొప్పగా పంటలుపండేస్తాయని, అందరూ బొట్లు పెట్టించుకుని పొలాల్లోకి వెళ్ళారు. మంత్రించిన విభూదీ, కుంకం పొలాల్లో చల్లారు. చెప్పినట్టే విరగబండేశాయి పంటలు.

దాంతో - జనానికి ఆయన దేవుడే అయిపోయాడు.

పందిరి చూస్తూ చూస్తూ వుండగానే పక్కా బిల్డింగుగా మారిపోయింది. పట్టణంలోని సబ్‌కలక్టర్‌గారు స్వామి వారి దర్శనానికి వచ్చాడు. ఆయనొక బెంగాలీ. స్వామివార్ని చూసి చాలా సంతోషించేరు. ఆశ్రమానికి స్వంత డబ్బులోంచి నిలబడ్డ పాటున 250 రూపాయలు విరాళంయిచ్చారు. చూస్తూవుండగానే - ఇతర ఆఫీసర్లు వేసిన డబ్బుతో - 5000 రూపాయలు జమఅయింది ఆశ్రమాన్ని ఆనుకునివున్న రెండెకరాల పోరంబోకు భూమిని ఆ శ్రమానికి దఖలు పరిచేరు. వూళ్ళో ధనవంతులు కూడా యధాశక్తి పెట్టుబడిపెట్టారు. బ్రహ్మాండమైన ఆశ్రమం తయారయిపోయింది. కొందరు శిష్యులు చేరారు. ఆశ్రమం విస్తరించింది. చూడవచ్చిన భక్తులతో నిత్య సంతర్పణలు ప్రారంభమయ్యాయి. ఒక పెద్ద హుండీ వెలిసింది. ప్రతి బస్సూ - అది నాన్ స్టాప్‌కానివ్వండి, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కానివ్వండి - అక్కడ ఆగి తీరుతుంది. ఒక ఆశ్రమవాసి పళ్ళెం పట్టుకుని బస్సుదగ్గరికి వస్తాడు. పళ్ళెంలోమంత్రించిన విభూది వుంటుంది. విభూది ఖాళీ అయిపోతుంది. పళ్ళెం డబ్బుల్తో నిండి పోతుంది.

పట్టణంలోకి ఒక సిద్ధాంతి వచ్చాడు. క్షత్రియులు విస్తారంగా వున్న ఒక వీధిలోకి వచ్చాడు. ఆ వీధిలో అందరూ లక్షాధికారులూ, కోటీశ్వరులూను. స్వామిజీ సాక్షాత్తు దైవాంశ సంభూతుడనీ, ఆయనకు సంతానం కలిగితే - ఆ సంతానానికి మహర్జాతకం పడుతుందనీ చెప్పారు. ఐశ్వర్యమూ, అధికార పదవులూ వలచివస్తాయి ఒక చక్రవర్తివలె దేశాన్ని (చిచీ రాష్ట్రాన్ని కాదు) - దేశాన్నే ఏలుతాడు. అని చెప్పాడు, సిద్ధాంతి. ఆ సిద్ధాంతి గొప్ప మహత్తు గల వాడు. ఆ మధ్య ఒక ఎం.ఎల్.ఏ.కి త్వరలో నువ్వు మంత్రివవుతావని చెప్పాడు అలా చెప్పిన కొద్ది రోజులలో రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయింది. మంత్రివర్గం రాజీనామా చేసింది. ఢిల్లీలో మంతనాలు జోరుగా సాగాయి. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేశాడు. ఆ ఎం.ఎల్.ఏ. కొత్త మంత్రివర్గంలో ఒక మంత్రి అయ్యాడు. అయితే ఆ మంత్రివర్గం మూడు నెలలేవుంది. ఆ తరువాత

రాష్ట్రపతి పరిపాలన. ఎన్నికలు వచ్చేశాయి. మంత్రిఐన తరువాత ఆయన్ని హోంమంత్రి చెయ్యమని చెప్పాడట సిద్ధాంతి. నూటొక్కకాసుల (బంగారపువే) మంత్రోక్తంగా హోమంలో వెయ్యాలట. మరి ఆ బంగారం కోసం ఆశించకూడదట. ఆదేం యజ్ఞం - నేను చెయ్యనన్నాడట మంత్రిగారు. సిద్ధాంతిదేం పోయింది ? మంత్రిగారికి పదవి పోయింది. నమ్మకపోతే అంతేమరి. ఆ సిద్ధాంతి ఎవ్వరేమిచ్చినా పుచ్చుకోడు. భిక్ష పుచ్చుకోమని వేడుకున్నారట. ససేమిరా వద్దనేశాడు. స్త్రీలు చూడగా భోజనం చెయ్యడట. స్త్రీలు వండినవి ససేమిరా ముట్టడట. నిష్టంటే అదీ. ఒక కంట్రాక్టరురాజుగారింట్లోకి వెళ్ళి. వాళ్ళ పెద్దమ్మాయి జాతకం చూసి - ఈ చిరంజీవి సంతానానికి మహర్జాతకం వుంది ఈమె కుమారుడు చక్రవర్తి అవుతాడని చెప్పాడు. ఆ అమ్మాయి వయసు పాతికేళ్ళపైనే వుంటుంది. అంతవరకూ ఆ చిరంజీవికి పెళ్లి కాకుండా వుండటానికి కారణం మనకు తెలీదు.

ఇది జరిగిన రెండు నెలల్లో ఆ అమ్మాయిని స్వామీజీకి యిచ్చి పెళ్లి చేశారు. నిలువెత్తు బంగారంతో సహా పుట్టదోయే కుమారుడు చక్రవర్తి కాడూ మరి ? ఈ రోజుల భాషలో చెప్పాలంటే, ఇండియా ప్రెసిడెంటన్న మాట. తెలుగువాళ్ళకు ప్రెసిడెంటు పదవి రాసిపెట్టి వున్నదేకద.

ఆ తరువాత మూడేళ్ళలో ఆ స్వామిజీ మరొక ఆరు పెళ్ళిళ్లు చేసుకున్నాడు. ఒక చౌదరిగారి కుమార్తె. ఒక రెడ్డిగారి కుమార్తె, మరొక విశ్వ బ్రాహ్మణోత్తముడయిన శిల్పాచార్యులవారి విధవ కూతురు, ప్రతి లక్ష్మివారం ముత్తయిదువులయిన స్త్రీ భక్తులకు మాత్రం దర్శనం ఇస్తారు. ఫోటోలు తీసుకోకూడదు.

ఆయన ప్రతి ఏటా యజ్ఞం చేస్తారు. చాలా దూర ప్రాంతాలనుంచి భక్తులు వస్తారు. అన్ని జాతులవాళ్ళు, అన్ని భాషలవాళ్లు కూడా వస్తారు. ఇటీవల ఇద్దరు అమెరికన్‌లు కూడా శిష్యులుగా ఒక వెలమదొరవారి చిన్న చెల్లెలు, ఒక దూదేకుల చిన్నది, మరొక పంచమ వనితా రత్నం.

రెడ్డిగారి కుమార్తె పెళ్లి సంగతి చెప్పుకోక తప్పదు. ఆ పట్టణంలో శ్రీ గవర్నమెంటువారు ఆర్.టీ.సి. కాంప్లెక్సు నిర్మించారు. రడ్డిగారికి ఆరున్నొక్క బస్సులున్నాయి. చాలా కాలంగా అధికార్లను బాగా తడిపి బళ్ళు నెట్టుకొస్తున్నారు. ఇప్పుడిక ఆగేట్టు లేదు. కొత్త ఆర్.టి.సి. బస్సులు వచ్చి పడిపోయేలా వున్నాయి. రెడ్డిగారు స్వామిజీని ఆశ్రయించారు. వారు ఆశీర్వదించారు. వారి శిష్యులు ఒక రాత్రి రెడ్డిగారింటికి వెళ్ళారు. రెడ్డి గారి కుమార్తెకు స్వామీజీతో వివాహం జరిగిపోయింది. కంప్లీట్ అయిన కాంప్లెక్స్ ఏవేవో కారణాల అడ్డంతో ఓపెన్ కాలేదు. కొడుక్కి ఇంజనీరింగు సీటు వచ్చేసింది. రెడ్డిగారికి రాహుమహర్దశ పట్టేసింది. ఆశ్రమానికి ఒక వాన్ కొనిచ్చేశారు. ఇప్పుడది ముఖ్యశిష్యులతో గ్రామాలకు వెళుతుంది. బియ్యం, పప్పు, కూరగాయలు, ఇతర దినుసులూ ఇచ్చినవి తెస్తుంది. వాన్ చూడగానే అడక్కుండానే పట్టు కొచ్చి ఇచ్చేస్తారు. భక్తులకు నిత్యసంతర్పణే కదా.

ఆ స్వామిజీకి ఇప్పుడు ఏడుగురు భార్యలు. వారి సగటు వయసులు - 24 సంవత్సరాలనీ, స్వామివారి వయసు అంతకు సరిగ్గా రెట్టింపనీ ఇటీవల ఒక విలేకరి రాశాడు. వారు ఏడువారాల నగలు ధరించి

చేరారు. (వారు భార్యాభర్తలు) యజ్ఞ సమయంలో హోమంలో బంగారపు కాసులు, వెండి కాసులు పడతాయి. హుండీలోపడే సొమ్ముకీ, లారీలతో, వాన్‌లతో వచ్చే సరుక్కీ లెక్కేలేదు. అన్నసంతర్పణ విస్తారంగా జరుగుతుంది. భూతశాంతి బహుకొద్దికదా మరి.

స్వామీజీ ఏనాడూ మహిమలు ప్రదర్శించలేదు. వారు సర్వమత "సారామృతాన్ని" (?) బోధిస్తారు. మానవసేవకు ప్రాధాన్యం ఇస్తారు. ఒక సంవత్సరం వరదలు వచ్చాయి. ఆశ్రమానికి ఒక మైలు దూరంలో ఒక మదుం (వంతెన) వుంది. అది వర్షానికి బీటలు తీసేసింది. ఆ మదుం పై ఒక గోమాత వుంది. మదుం బీటలు తీసేసిన సమయంలో అది అంబా అంబా అని అరిచిందట. అటూ ఇటూ కూడా, ఆ అరుపువిని అనేక లారీలు ఆగిపోయాయి. ఆ గోమాత ఎంతో ప్రమాదం తప్పించింది. ఇది స్వామిజీ మహిమకాక మరేమిటి ? ఇప్పుడా గోవు ఆశ్రమంలోనేవుంది. స్వామీజీ-తాలీత- పాదచారులై బయలు దేరారు. నిర్వాసితులైన ప్రజలకు ఆశ్రమంలో వసతి కల్పించారు. విరివిగా అన్న సంతర్పణ చేశారు. అప్పటి నుంచీ మంత్రాలు చెబుతూ విభూతులు పంచి పెట్టేస్వాములవార్లపై ఆ ప్రాంతపు జనాలకు నమ్మకం పోయింది. ఈ స్వామీజీని అందరూ ప్రజల మనిషి అయిన స్వామీజీ అని, దీన జనరక్షకుడైన స్వామీజీ అని పిలుస్తున్నారు.

స్వామిజీకి ఇటీవల ధ్యానానికి అవకాశం తగ్గిపోయింది. ఆశ్రమంలో ఎప్పుడు చూసినా జనం తండోపతండాలుగా వుంటున్నారు. వారికి ఇటీవల కొండమీద వేరే ఒక చిన్న ప్రత్యేక ఆశ్రమం కట్టించాడు. ఒక భక్తుడు. ఆ భక్తుడొక పెద్ద ఇంజనీరు. కొత్త ప్రభుత్వం దెబ్బతట్టుకోలేక సస్పెండ్ అయిపోయాడు. ఇంజనీరుగారి వర్గం ఆ జిల్లామంత్రిగారికి వ్యతిరేక వర్గం. అసలు కీలకం అదీ. ఇంజనీరుగారిమీద చాలా చాలా "ఆరోపణ"లున్నాయి. స్వామివార్ని దర్శనం చేసుకున్నాడు. శిష్యుల సలహాల ననుసరించి కొండమీద సకల సౌకర్యాలతో చిన్న ఆశ్రమం కట్టించాడు. బంగారం కురిసే జిల్లాకు బదిలీ అయిపోయింది. "ఎంక్వయిరీ" నీళ్లు కారిపోయింది.

చౌదరిగారమ్మాయీ రెడ్డిగారమ్మాయీ ఒకేసారి నెలతప్పేరు. చౌదరిగారమ్మాయికి పండంటికొడుకు పుట్టేడు. రెడ్డిగారమ్మాయికి ఎబార్షన్ జరిగింది. తండ్రి పరుగెత్తుకు వచ్చాడు. ఆ అమ్మాయికి ప్రాణగండం తప్పిందని చెప్పారు స్వామీజీ. ఇక పై అలాంటవి జరగకుండా ఉండటానికి కీడుపోవడానికి శనీశ్వరుడి ఆరంగుళాల బంగారు ప్రతిమచేయించి శాంతి చేయించాడు.

అప్పటినుంచీ ఆశ్రమంలో తగువులు వచ్చాయని ఒక పుకారు లేచింది. అమెరికన్లు తగువులకు మూలం అని జనం ఆగుబ్బుగా చెప్పుకోవడం ప్రారంభించారు.

ఏడవభార్య అయిన పంచమవనితారత్నం పెళ్ళిలో చాలా గొడవలు జరిగాయి పోలీసు కంప్లయింట్లు వెళ్ళాయి. స్వామీజీ స్మగ్లరట. బంగారం బిస్కట్లున్నాయట. కొండమీద ఏకాంతంగా వున్న ఆశ్రమంలో స్వామీజీవారు శృంగారలీలలు చిత్తగిస్తున్నారట. ఎంత తప్పుకళ్ళు పోవూ ? అలాంటి మాటలంటే

పురుగులుపడి పోతారు. పోలీసులలోనూ భక్తశిఖామణులున్నారు. మహానుభావులు, వారిదయవల్ల ఈ గొడవ తప్పింది. పైన దేవుడు లేడూ ?

కాని -ఉన్నట్టుండి ఎంతఘోరం జరిగి పోయింది !!!

కొండమీద ఏకాంత ఆశ్రమంలో గత రాత్రి స్వామీజీని ఎవరో హత్యచేశారు. దాంతో ఆ ప్రాంతంలో సంచలనం బయలు దేరిపోయింది.

ఉగ్రవాదులే అయివుంటారు. సందేహం లేదు. స్వామీజీ -మిగిలిన ఆరుగురు భార్యలూ బంగారపు నగలతో సహా కనిపించడం లేదు. ప్రధాన శిష్యుడు అనగా చిన్న స్వామీజీ భక్తులైన అమెరికన్ దంపతులూ కనపడడంలేదు. ప్రధాన శిష్యుడు అనగా చిన్న స్వామీజీ భక్తులైన అమెరికన్ దంపతులూ కనపడటం లేదు.

పెద్దభార్య మాత్రం వుంది.

ఈ మధ్య పట్టణంలోని డి.ఎస్.పి గారు మారిపోయారు. కొత్తాయన మా స్ట్రిక్టు మనిషి. ఆయన ఆశ్రమానికి హుటాహుటిన వచ్చాడు. కొన్ని ఖచ్చితమైన అనుమానాలపై కొందరు ఆశ్రమవాసుల్ని అరెస్టు చేశారు.

కొండమీద ఆశ్రమానికి నేల మాళిగ వుందట. అక్కడ బంగారపు బిస్కట్లు పోతపోసే సాధన సామగ్రి దొరికింది. స్విట్జర్లండులోని ఒక బ్యాంకు లోనూ, శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా) లోని ఒకబ్యాంకు లోనూ స్వామివారికి లక్షలాదిగా ధనం నిల్వవున్నట్టు నిరూపించే కొన్ని పత్రాలు దొరికాయి. ఆరుగురు కన్నె పిల్లతో కామకలాపాలు సాగించి కొన్నాళ్ళ తరవాత వారిని ఒకానొక "గల్ఫ్‌కంట్రీ" కి ఎగుమతి చేసినట్టు అనుమానించే అవకాశం కలుగుతోంది.

పెద్దభార్య చుట్టూ విలేకరులు చేరారు. ఆమె స్వామీజీ మీద విపరీతమైన కోపం వెలిగక్కింది. ఆయనకు కామవాంఛచాలా విపరీతంట. ఒకేసారి ఇద్దరు ముగ్గురు స్త్రీలతో వినోదించేవాడట. ఇతర పురుషులతో కలిసి ఒకేసారి ఒకే స్త్రీతో విలాసాలు సాగించేవాడట. ధనకాంక్ష కూడా చాలా అధికంగా వుండేదట. భక్తుల ప్రయోజనాలు నెరవేర్చడంకోసం పెద్దమొత్తాల్లో సొమ్ములాగి పెద్దపెద్ద అధికారులకు రాజకీయనాయకులకూ తన ఆరుగురు భార్యలనూ (పెద్ద-మొదటి భార్యని తప్ప) తార్చేవాడట. అలా తార్చి విచిత్రమైన సంతోషం అనుభవించేవాడట.

ఆయన సంతానానికి మహర్జాతకం పడుతుందని పట్టణంలో తిరిగి ప్రచారం చేసిన సిద్ధాంతి స్వామీజీ మనిషేనట. చివరి రోజుల్లో అతనికీ స్వామీజీకి చెడిందట. అమెరికన్ దంపతులను శిష్యులుగా చేర్చుకుని వాళ్ళద్వారా తన ధనం యావత్తూ విదేశాలకు చేరవెయ్యడం ప్రారంభించాడట. మూడవభార్యకు పుట్టిన కొడుకు, కాబోయే దేశాధినేతగా చెప్పబడినవాడు, అమెరికన్‌కు పుట్టినవాడేనట. సిద్ధాంతికి ఈ రహస్యాన్ని ముందు బట్టబయలు చేశాడు. అమెరికన్ భక్తుడు సిద్ధాంతిని చంపాలని ఎత్తువేశాడు.

ఆ సంగతి ముందుగా గ్రహించి చేతికి దొరికింది పట్టుకుని పారిపోయాడు. సిద్ధాంతికి క్రమంగా గొడవలు ఎక్కువయిపోయియి. స్వామీజీ కోరికను అమెరికన్ వనిత తిరస్కరించింది. బలవంతం చేయబోయాడు. అసలు ఆరోజే అమెరికన్ చేతిలో స్వామీజీ చావవలసింది తప్పింది. ఆ అమెరికన్లు పెద్ద శిష్యుడి (లేక చిన్న స్వామీజీ) సాయంతో కుట్రపన్ని స్వామీజీని హత్యచేసి, బంగారాన్నీ భార్యల్నీ చెక్కు పుస్తకాల్నీ తీసుకుని బహుశా విదేశాలు పారిపోయి వుంటారట. అమెరికన్ దంపతులకోసం ఒకరోజు రాత్రి రహస్యంగా కొండమీదికి హెలికాప్టర్ రావడం తాను స్వయంగా చూశానని స్వామీజీ పెద్దభార్య విలేకరులకు చెప్పింది.

స్వామీజీ భక్తుడైన ఒక మంత్రిగారు (ఆయన స్వామీజీవల్ల చాలా సహాయాలు పొందారు.) మరికొందరు పెద్ద మనుషులు కలిసి ఈ వార్తలు పేపర్లోకి రానివ్వలేదు. అసలు సంగతులు అణిచేసి ఇదంతా ఉగ్రవాదుల చర్యగా పేపర్లో రాయించేరట.

ఇదంతా నీకెలా తెలిసిందంటారా ? మా పట్టణంలో ఈ మధ్య ఒక నాలుగు పేజీల సచిత్ర కరపత్రం విడుదలైంది. అందులో స్వామిలీలలు ఫోటోలతో సహావున్నాయి. అదండీ సంగతి. కొన్ని సత్యాలు దాచేస్తే దాగవుసుమండీ.

*ప్రచురణ : ఆదివారం, వారపత్రిక 19 ఆగస్టు 1984*